సాక్షి పశ్చిమగోదావరి

గురువారం । 17 । జూలై । 2025



సచివాలయ ఉద్యోగుల్లో గందరగోళం

ఉద్యోగాలు ఉంచుతారా... పీకేస్తారా... ఉంచితే ఏ శాఖ కేటాయిస్తారు.. ఏ పనులు చేయమంటారు.. ఇవీ సచివాలయ ఉద్యోగుల మదిలో మెదులుతున్న ప్రశ్నలు. 8లో ▸



శ్రీవారి దేవస్థానంలో తనిఖీలు

శ్రీవారి ఆలయంలో భక్తులకు వసతులు, సౌకర్యాలు, ప్రసాదాల నాణ్యతను దేవదాయ శాఖ జేసీ భ్రమరాంబ బుధవారం తనిఖీ చేశారు. 8లో ▸



యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు

కామవరపుకోట మండలంలో మట్టి దందా యథేచ్ఛగా సాగుతోంది. కూటమి నాయకుల అండదండలతో పగలు రాత్రి తేడా లేకుండా మట్టిని కొల్లగొడుతున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విచారణ



వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ సీఐ బాలకృష్ణ

నరసాపురం: నరసాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం ఓ పాత కేసుకు సంబంధించి విచారణ నిర్వహించారు. ఉదయం 11 గంటల సమయంలో ఏసీబీ సీఐ(ఏలూరు) కె.బాలకృష్ణ సిబ్బందితో కలసి కార్యాలయనికి వచ్చి విచారణ చేపట్టారు. 2023లో వీరభద్రరావు సబ్‌రిజిస్ట్రార్‌గా ఉండగా అక్రమ భూ రిజిస్ట్రేషన్స్‌పై ఫిర్యాదులు అందడంతో అప్పటిలో ఏసీబీ అధికారులు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంపై దాడులు నిర్వహించారు. అప్పటి సబ్‌రిజిస్ట్రార్ సస్పెండ్ అయ్యారు. కేసు దర్యాప్తు చివరి దశకు చేరడంతో మరోమారు సమగ్ర దర్యాప్తు నిమిత్తం మళ్లీ ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఏసీబీ సీఐ బాలకృష్ణ మాట్లాడుతూ పాతకేసు దర్యాప్తులో భాగంగా విచారణ జరిపినట్టు చెప్పారు. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని వివరించారు. ఏసీబీ విచారణతో రోజంతా పూర్తిగా రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి.

18న డీఎస్సీ-2003 ఉపాధ్యాయుల నిరసన

భీమవరం: డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు మెమో-57 అమలుచేస్తూ ఓపీఎస్‌లోకి తీసుకు రావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈనెల 18న ఏలూరు కలెక్టరేట్ వద్ద నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఎస్సీ-2003 ఉపాధ్యాయుల ఫోరం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ సూర్యప్రకాష్, బుధవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో నూతన పింఛన్ విధానం సీపీఎస్ అమలుకుముందే నియామకం పూర్తయిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు కేంద్రం ప్రకటించిన మెమోను అమలుచేయాలని కోరారు. తమ డిమాండ్స్ సాధనకు ఏలూరులో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

న్యాయ సేవలపై అవగాహన కల్పించాలి



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి

ఏలూరు (టూటౌన్): న్యాయ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో ప్రతి పౌరుడు బాధ్యత తీసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణం నుంచి బుధవారం బైక్ ర్యాలీని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వారం రోజుల నుంచి మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారంపై వివిధ ప్రచార మాధ్యమాల ద్వారా ప్రజలను అవగాహన కలిగిస్తున్నామని, అందులో భాగంగా బుధవారం జిల్లా కోర్టు ప్రాంగణం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించామని తెలిపారు. విద్యావంతులైన పౌరులు మారుమూల గ్రామాలలోని ప్రజలను చైతన్యవంతులను చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏడో అదనపు జిల్లా జడ్జి వై.శ్రీనివాసరావు, ఎనిమిదో అదనపు జిల్లా జడ్జి ఐ.శ్రీనివాస మూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కె.కె.వి.బులికృష్ణ, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి.రఘునాథ్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోనె సీతారాం, ప్రభుత్వ న్యాయవాది బి.జె. రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటలు ఎండుతున్నా ప్రభుత్వానికి పట్టదా?



ఏలూరు-కైకలూరు రహదారిని దిగ్బంధించిన రైతులు

ఏలూరు(టూటౌన్): కృష్ణా డెల్టా శివారు ప్రాంత భూములకు సాగునీరు అందించాలంటూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఏలూరు-కైకలూరు రహదారి దిగ్బంధనం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఎండిన వరి నారు మట్టి గడ్డలతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగునీరు అందించి పంటలు కాపాడాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఏలూరు రూరల్ ఎస్సై ఆధ్వర్యంలో పోలీసులు, స్పెషల్ ఫోర్స్ మోహరించినా రైతులు రాస్తారోకో నిర్వహించారు. దీంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభించింది. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కృష్ణా డెల్టా శివారు ప్రాంత భూములకు సాగునీరు అందక నారుమళ్ళు, నాట్లు వేసిన చేలు ఎండిపోతున్నా ఇరిగేషన్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

లేసు.. భేష్

- అల్లికల్లో రాణిస్తున్న పశ్చిమ మహిళలు
- కేంద్ర ప్రభుత్వ ఒక జిల్లా–ఒక ఉత్పత్తి అవార్డు సాధించిన నరసాపురం లేసులు
- ఇప్పటికే భౌగోళిక గుర్తింపుతో ఖండాంతర ఖ్యాతి
- గత ఏడాది ఒలింపిక్స్‌లోనూ మెరిసిన మన లేసులు
- లేసు పరిశ్రమకు ఊపిరిలూదిన మాజీ సీఎం వైఎస్సార్
- 2004లో లేసు పార్కు ఏర్పాటు



లేసులతో తయారుచేసిన ఫోటో ఫ్రేమ్



సీతారాంపురంలో దివంగత వైఎస్ హయాంలో ఏర్పాటుచేసిన లేసు పార్క్

> అబ్బురపర్చే అల్లికలతో పశ్చిమగోదావరి జిల్లా అతివలు అవార్డుల మోత మోగిస్తున్నారు. ఔరా అనిపించే హ్యాండ్ మేడ్ ఉత్పత్తులతో ఇప్పటికే నరసాపురం లేసుకు భౌగోళిక గుర్తింపు తెచ్చారు. గత ఏడాది పారిస్‌లో జరిగిన ఒలింపిక్స్ క్రీడా సంగ్రామంలో మన లేసులను మెరిపించారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక జిల్లా–ఒక ఉత్పత్తి అవార్డును సాధించారు.

సాక్షి, భీమవరం: హస్తకళల్లో లేసు అల్లికలు ముఖ్యమైనవి. ఇక్కడి మహిళలు సూది మొనకు దారం తగిలించి అలవోకగా అల్లికలు చేస్తుంటారు. బ్రిటిష్ హయాంలో జల రవాణాకు నరసాపురం కేంద్రంగా ఉండేది. అప్పట్లో క్రిస్టియన్ మిషనరీ సంస్థల ద్వారా పరిచయమైన లేసు అల్లికలను తర్వాతి కాలంలో ఈ ప్రాంతానికి భౌగోళిక గుర్తింపు తెచ్చే స్థాయికి ఇక్కడి మహిళలు అభివృద్ధి చేశారు. టవల్స్, టేబుల్ క్లాత్స్, లంచ్ మ్యాట్స్, క్రోచెట్ బ్యాగ్స్, డెకో కుషన్స్, బీచ్ కలెక్షన్స్ తదితర ఇక్కడి హ్యాండ్ మేడ్ ఉత్పత్తులకు విదేశాల్లో మంచి గిరాకీ ఉంది. వీటిని అమెరికా, యూరప్, సింగపూర్, కొరియా తదితర దేశాలకు ఎగుమతులు చేసే కంపెనీలు నరసాపురం, పరిసరాల్లో 50కు పైగా ఉన్నాయి. దేశ విదేశాల్లో జరిగే ఎక్స్‌పోలు, డిజైనర్లు, థర్డ్ పార్టీల ద్వారా ఆర్డర్లు తీసుకుని ఎగుమతులు చేస్తుంటారు. గతంలో ఏటా రూ.300 కోట్లు మేర లేసు ఉత్పత్తులు ఎగుమతులు జరిగేవి.

అండగా నిలిచిన వైఎస్సార్

స్థానిక మహిళలు పొద్దు పొడవక ముందే లేచి ఇంటి పనులు, వంట ముగించుకుని, పిల్లలను స్కూళ్లకు, భర్తను పనికి పంపి అల్లికల పనిలో పడతారు. నలుగురైదుగురు కలసి టీవీ చూస్తున్నా, కబుర్లు చెప్పుకుంటున్నా వారి చేతిలో సూది, దారం కదులుతూనే ఉంటాయి. ఒక మహిళ రోజులో ఐదారు గంటలు పనిచేస్తే కేజీ దారం అల్లికకు పది రోజుల పడుతుంది. డిజైన్‌ను బట్టి కేజీకి గతంలో రూ.15 నుంచి రూ. 50 మాత్రమే వారికి కంపెనీలు ఇచ్చేవి. దళారుల దోపిడీని గుర్తించిన దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి మహిళలకు అండగా 2004లో నరసాపురం రూరల్ సీతారాంపురంలో లేసు పార్కును ఏర్పాటుచేశారు. కేజీ దారం అల్లికకు ఒక్కసారిగా రూ.100 పెంచారు. దీనికి సమానంగా ప్రైవేట్ కంపెనీలు వేతనాన్ని పెంచాయి. మొదట్లో లేసు పార్కు పరిధిలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఆరు మండలాలకు చెందిన 10 వేల మంది సభ్యులు ఉంటే తర్వాతి కాలంలో ఈ సంఖ్య 15 మండలాల్లోని 30 వేల మందికి పెరిగింది. మార్కెటింగ్ మేనేజర్, ఇతర సిబ్బంది ఆర్డర్లు తెచ్చి మహిళలతో అల్లికలు చేయించడం ద్వారా అప్పట్లో ఏడాదికి రూ.100 కోట్ల విలువైన ఉత్పత్తులు ఎగుమతులు జరిగేవి. ఈ పార్క్ ద్వారా గతంలో స్థానిక మహిళలు అమెరికా, యూరప్, సింగపూర్ తదితర దేశాలకు వెళ్లి లేసు ఉత్పత్తులను ప్రదర్శించడం గమనార్హం. యాంత్రీకరణ, ఇతర దేశాల నుంచి పోటీ, కోవిడ్ పరిణామాల అనంతరం లేసు పరిశ్రమ ప్రాభవం కోల్పోయి ఎగుమతులు తగ్గినా ఏడాది క్రితం భౌగోళిక గుర్తింపు దక్కించుకుని సత్తాను చాటింది. పారిస్ వేదికగా గత ఏడాది 206 దేశాలు పాల్గొన్న ఒలింపిక్స్ పోటీల్లో ఇక్కడి లేసు ఉత్పత్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నిర్వాహకుల ఆర్డరుపై సీతారాంపురానికి చెందిన సంస్థ క్రీడాకారులు, సందర్శకుల కోసం లేస్, ఫ్యాబ్రిక్‌లను ఉపయోగించి ఒలింపిక్స్ థీమ్, లోగోలతో టవల్స్, డెకో కుషన్స్, బీచ్ కలెక్షన్స్ తదితర ఉత్పత్తులను భారీ మొత్తంలో పంపింది.



వివిధ రకాల డిజైన్లలో లేసుతో తయారుచేసిన దుస్తులు

ఆనందంగా ఉంది



చిన్నతనం నుంచి ఇంట్లో అమ్మ, నానమ్మలను చూసి లేసులు అల్లడం అలవాటు చేసుకున్నాను. ఇప్పటికీ రోజూ ఖాళీ సమయంలో అల్లికలు చేస్తుంటాం. వీటిపై వచ్చే డబ్బులు ఇంటిలోని చిన్నచిన్న అవసరాలకు ఎంతో ఉపయోగపడతాయి. లేసు అల్లికలకు అవార్డు రావడం చాలా ఆనందంగా ఉంది.

– రాట్నాల లక్ష్మి, గృహిణి, ఎల్‌బీ చర్ల

తరతరాలుగా అల్లికలు



మా చిన్నతనంతో పోలిస్తే ఇప్పుడు లేసులు అల్లేవారు కొంత తగ్గారని చెప్పవచ్చు. అప్పట్లో ఏ ఇంటి వద్ద చూసిన ఆడవాళ్లు అల్లికలు చేస్తూ కనిపించేవారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఇప్పటితరం వారు రకారకాల డిజైన్లలో అల్లికలు చేస్తూ జిల్లాకు దేశ విదేశాల్లో మంచి గుర్తింపు తీసుకురావడం అభినందనీయం.

– తెలగంశెట్టి వెంకటలక్ష్మి, నరసాపురం



కేంద్ర మంత్రి పియూష్ గోయల్ నుంచి అవార్డు అందుకుంటున్న కలెక్టర్ నాగరాణి(ఫైల్)

ఒక జిల్లా.. ఒక ఉత్పత్తికి ఎంపిక

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి దాదాపు రెండు లక్షల మంది మహిళలు లేసు అల్లికలు చేస్తున్నారు. 2024–25కి గాను నరసాపురం లేసుకు కేంద్ర ప్రభుత్వ ఒక జిల్లా–ఒక ఉత్పత్తి అవార్డు దక్కింది. కేంద్ర ప్రభుత్వ వాణిజ్య పన్నులు, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రెండురోజుల క్రితం న్యూఢిల్లీ ప్రగతి మైదానంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని అల్లికలు చేసే మహిళలకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు.



లేసులతో తయారుచేసిన ఫోటో ఫ్రేమ్

శిశు జనన రేటుపై అవగాహన కల్పించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): జూలై 11న నిర్వహించిన ప్రపంచ జనాభా దినోత్సవంలో భాగంగా బుధవారం కలెక్టరేట్ వశిష్ఠ సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం దంపతులు ఒక బిడ్డతో సరిపెట్టుకుంటున్నారని దానివల్ల భవిష్యత్తులో యువ జనాభా తగ్గిపోతుందన్నారు. జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రులలో గర్భిణులు కాన్పులు చేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో గర్భిణులకు అవసరమైన మందులు, వైద్య చికిత్స, పౌష్టికాహారం ఉచితంగా అందిస్తామని, వీటిని క్రమం తప్పకుండా అందించేందుకు వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కౌమార దశలో వివాహం, గర్భం దాల్చడంతో వచ్చే ప్రభావాలపై అవగాహన కల్పించాలన్నారు. పదిమంది తల్లులకు నగదు పురస్కారాలను, అందించారు.



లక్కీడీప్ ద్వారా ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న కలెక్టర్ నాగరాణి

సాగునీటి సరఫరాపై దిద్దుబాటు చర్యలు

భీమవరం: జిల్లాలో సార్వా నాట్లు ఆలస్యం, నారుమళ్లు ఎండిపోవడంపై అధికారులు దృష్టిసారించారు. అనేక మండలాల్లో వరి నారుమళ్లు ఎండిపోతున్న వైనాన్ని పత్రికల్లో ప్రచురించడంతో కలెక్టర్ బుధవారం కలెక్టరేట్‌లో పంట పొలాలకు సాగునీటి సరఫరాపై ఇరిగేషన్, డ్రెయిన్లు, ఎర్రకాలువ, గోదావరి హెడ్‌వాటర్ వర్క్స్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని శివారు భూములకు సైతం సాగునీరు అందించడానికి జల వనరుల శాఖాధికారులు నిరంతరాయంగా నీటి సరఫరాను పర్యవేక్షించాలని విధుల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

తగ్గిన ఉచిత విద్య అడ్మిషన్లు

భీమవరం: ప్రైవేటు స్కూళ్లలో పేదలకు ఉచిత విద్యనందించే పథకానికి కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో అడ్మిషన్లు తగ్గిపోయాయి. గత రెండేళ్లుగా జిల్లాలోని ప్రవేటు స్కూళ్లకు ప్రభుత్వం చెల్లించాల్సిన సుమారు రూ.2 కోట్ల నిధులు విడుదల చేయకపోవడంతో ఫీజు మొత్తాన్ని విద్యార్థుల తల్లిదండ్రులే చెల్లించాలని స్కూల్ యాజమాన్యాలు ఒత్తిడి చేయడంతో పేదలు ప్రైవేటు స్కూళ్లలో అడ్మిషన్స్ పొందడానికి వెనుకడుగు వేస్తున్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో దాదాపు 1,500 మంది ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకోగా వివిధ ప్రవేటు స్కూళ్లకు దాదాపు 1,261 మందిని అలాట్ చేశారు. కేవలం 809 మంది మాత్రమే అడ్మిషన్లు పొందారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పేదలు తమ పిల్లలను ప్రైవేటు స్కూళ్లలో చదివించాలనే కల నెలవేర్చడానికి ప్రతి ప్రైవేటు స్కూల్లో ఒకటో తరగతిలో విద్యార్థుల సంఖ్యను బట్టి 25 శాతం సీట్లు పేదలకు కేటాయించేలా చర్యలు తీసుకున్నారు. ఐదేళ్లు నిండినవారికి రిజర్వేషన్ల ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తారు. ప్రైవేటు స్కూళ్లలో ఒకటో తరగతిలో చేరిన విద్యార్థులకు పట్టణ ప్రాంతాల్లో ఒక్కొక్క విద్యార్థికి రూ.7,500, గ్రామీణ ప్రాంతాల్లో రూ. 6,500 ప్రభుత్వం ఆయా పాఠశాలలకు నిధులు జమచేస్తుంది.



జిల్లాలో 700 ప్రైవేటు స్కూళ్లు

జిల్లాలోని 20 మండలాల పరిధిలో సుమారు 700 ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్ ఉన్నాయి. వీటిలో 2022–23లో 1,162 మంది, 2023–24లో 1,176 మంది, 2024–25లో 1,787 మంది విద్యార్థులు చేరారు. వీరికి దాదాపు ప్రభుత్వం సుమారు రూ.2 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని అంచనా. ప్రైవేటు స్కూళ్లకు ప్రభుత్వం చెల్లించాల్సిన నిధులు చెల్లించకపోవడంతో కొన్ని ప్రైవేటు యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచే ఫీజులు వసూలు చేశాయి. ఇలాంటి తరుణంలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రైవేటు స్కూళ్లలో చేరడానికి దాదాపు 1,500 మంది దరఖాస్తు చేసుకోగా కేవలం 809 మంది మాత్రమే చేరారు. పాత బకాయిలను చెల్లించకపోవడంతో ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలు కొత్తగా విద్యార్థులను చేర్చుకునేందుకు నిరాకరించాయి. వారితో ప్రభుత్వం చర్చలు జరిపి పాత బకాయిలు త్వరలోనే చెల్లిస్తామని హామీ ఇచ్చినా దానిపై కదలికలేదు. దీంతో ఉచిత విద్య పొందడానికి వెళ్లిన విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వం సొమ్ములు చెల్లించకపోతే మీరే చెల్లించాలంటూ ఖరాఖండిగా చెప్పడంతో అంత పెద్దమొత్తంలో సొమ్ము చెల్లించలేక అనేక మంది వెనుదిరిగినట్లు తెలిసింది.

ఆక్వాకు వాతావరణ గండం

పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో రైతులు విలవిల

కైకలూరు: మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా మారింది ఉమ్మడి జిల్లాలో ఆక్వా రైతుల పరిస్థితి. ఈ ఏడాది వేసవిలో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో పెరగడంతో ఆ ప్రభావం చేపల, రొయ్యల పరిశ్రమపై పడింది. రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు ముందుగా వచ్చి వర్షాలు కురుస్తుండంతో ఆక్వా రైతులు సంతోషించారు. ఇది ఎంతో కాలం నిలవలేదు. జూలై నెలలో ఉష్ణోగ్రతలు భయపెడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఆక్వా సాగుకు దినదిన గండంగా మారింది. ఉమ్మడి జిల్లాలో ఆక్వాసాగు విస్తీర్ణం 2.90 లక్షల ఎకరాల్లో సాగువుతోంది. ఇందులో 1.80 లక్షల ఎకరాల్లో చేపలు, 1.10 లక్షల ఎకరాల్లో రొయ్యలు సాగు చేస్తున్నారు. ఏలూరు జిల్లాలో ఏలూరు, కైకలూరు, దెందులూరు, ఉంగుటూరు, పశ్చిమగోదావరి జిల్లాలో భీమవరం, ఆకివీడు, నరసాపురం నియోజకవర్గాల్లో ఆక్వా సాగు ఎక్కువగా చేస్తున్నారు. రొయ్యల, చేపల పెరుగుదల 28, 30 డిగ్రీల ఉష్ణోగ్రత దగ్గర బాగుంటుంది. మూడు రోజులుగా ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు 37 నుంచి 38 డిగ్రీల ఉష్ణోగ్రతకు చేరుతున్నాయి.



బుధవారం కైకలూరులో 36 డిగ్రీలు, భీమవరంలో 37 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల నీటిలో ప్రాణవాయువు కరిగే శక్తి తగ్గుతుంది. అధిక ఉష్ణోగ్రతల వల్ల చెరువుల్లో నీటి లెవల్స్ 3 అంతస్తులుగా వేరుపడతాయి. దీని వల్ల చెరువు పైపొరల్లో డీవో ఎక్కువగా, అడుగు పొరల్లో డీవో తక్కువగా వుంటూ చేపలు, రొయ్యలకు ఇబ్బంది కలిగిస్తుంది. చెరువు నీటిలో అవసరమైన, హానికరమైన శైవలాలు కూడా ఏర్పడతాయి. నీటి పీహెచ్ పెరిగిపోతుంది. నీటి ఉష్ణోగ్రత పీహెచ్ అధికంగా ఉన్నప్పుడు అమ్మోనియా స్థాయి పెరిగి రొయ్యలు, చేపలకు ఒత్తిడి కలిగించి వ్యాధులకు దారితీస్తుంది. ఎక్కువగా చిరు చేపలు, రొయ్యలు అధిక నీటి గుణాల తారతమ్యాలను తట్టుకోలేవు.

ఇవి పాటించాలి : ఆక్వా రైతులు పాటించే సూచనలను కై కలూరు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సిహెచ్.గణపతి బుధవారం సూచించారు.

- అధిక ఉష్ణోగ్రతల వల్ల డీవో తగ్గి చేపలపై ఒత్తిడి కలుగుతుంది. ఆక్సిజన్ లేని కారణంగా ముట్టెలు పైకెత్తి గాలిని పీల్చుకుంటాయి.
- ఆక్సిజన్ కొరత వల్ల చెరువు అడుగున అమ్మోనియా, నైట్రేట్ వంటి విషవాయువుల పెరిగి చేపలు చనిపోయే అవకాశం ఉంది.
- విష వాయువులు ఏర్పడినప్పుడు ఎరేషన్ ఎక్కువగా పెట్టాలి. జిప్సం ఎకరానికి 50 నుంచి 80 కేజీలు వినియోగించాలి.
- ఆక్సిజన్ నివారించడానికి కాల్షియం పెరాక్సైడ్, హైడ్రోజన్ పెరాక్సైడ్ ఎకరానికి అరకేజీ నుంచి కేజీ ఇసుకలో కలిపి లేదా నేరుగా కలిపి చల్లాలి.
- ఉష్ణోగ్రతలు పెరిగినప్పుడు నీటి ఉదజని సూచిక పీహెచ్ వ్యత్యాసం పెరిగిపోవటం వల్ల చేపలపై ఒత్తిడి ఏర్పడుతుంది.
- ఫెర్టిలైజర్స్ కెమికల్స్ ఎక్కువగా వినియోగించవద్దు.

క్లుప్తంగా

తరగతి గదిలో పాఠాలను శ్రద్ధగా నేర్చుకోవాలి

నూజివీడు: స్థానిక ట్రిపుల్ ఐటీలో పీయూసీ ప్రథమ సంవత్సర విద్యార్థులకు బుధవారం రెండోరోజు కూడా ఓరియంటేషన్ కార్యక్రమం కొనసాగింది. దీనిలో భాగంగా డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ మాట్లాడుతూ ఫ్యాకల్టీ తరగతి గదిలో చెప్పే పాఠాలను శ్రద్ధగా విని చదువుకోవాలన్నారు. ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ విద్యను పూర్తిచేసిన వారందరికి ప్లేస్‌మెంట్స్‌ను తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఎవరికి ఎలాంటి ఇబ్బందులు ఉన్నా కేర్‌టేకర్‌లు, వార్డెన్‌ల దృష్టికి తీసుకువస్తే వాటికి పరిష్కారం చూపడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏవో లక్ష్మణరావు, డీన్ అకడమిక్స్ సాదు చిరంజీవి, అసోసియేట్ అకడమిక్ డీన్స్ రఘు, భరత్, డీఎస్‌డబ్ల్యూఓ రాజేష్, చీఫ్ వార్డెన్ బీ సురేష్‌బాబు, పీయూసీ మెంటార్స్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో యువకుడి మృతి

మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

నూజివీడు: పట్టణంలోని మైలవరం రోడ్డులో ఉన్న ఫైర్ స్టేషన్ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఒక యువకుడు మృతిచెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల ప్రకారం మండలంలోని బత్తులవారిగూడెంకు చెందిన సాకిరి రాజేష్‌బాబు (20) యనమదలకు చెందిన తన స్నేహితుడు సిద్ధమూరి సిరిల్‌బాబు(21)ను బైక్‌పై ఎక్కించుకొని నూజివీడు వస్తుండగా పట్టణంలోని ఫైర్ స్టేషన్ సమీపంలోకి వచ్చే సరికి యానాదుల కాలనీ వైపు నుంచి వస్తున్న మెలిక సూరజ్(38) ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో రాజేష్ మృతిచెందగా సిరిల్‌బాబుకు, సూరజ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను పట్టణంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్సను అందించిన అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడకు తరలించారు. పట్టణ సీఐ పీ సత్యశ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: బాలికను బలవంతంగా మోటార్‌సైకిల్‌పై ఎక్కించుకుని తీసుకువెళ్లిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. పేరంపేటకు చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన యువకుడు లాగు నవదీప్ ప్రేమించమని వెంటపడుతున్నాడు. ఈ క్రమంలో ప్రేమించకపోతే చనిపోతానని బెదిరిస్తూ, దురుద్దేశపూర్వకంగా బాలికను 14వ తేదీ రాత్రి బలవంతంగా మోటార్‌సైకిల్‌పై ఎక్కించుకుని తీసుకువెళ్లాడని బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో భాగంగా బుధవారం లాగు నవదీప్‌ను, అతనికి సహకరించిన తగరం ప్రభుదాస్, తగరం శాంతిరాజులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై జబీర్ తెలిపారు. బాలికను ఆమె తల్లిదండ్రులకు అప్పగించామన్నారు.

రాపాక కాలువలో గుర్తుతెలియని మృతదేహం

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు మండలం శివదేవుని చిక్కాల గ్రామం రాపాక కాలువలో మరో గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. బుధవారం రాపాక పంట కాలువలో సుమారు 45 నుంచి 50 సంవత్సరాల వయస్సు కలిగిన పురుషుని మృతదేహాన్ని గ్రామస్తులు గుర్తించి గ్రామ అధికారులు, పోలీసులకు సమాచారం అందించారు. సోమవారం ఇదే రాపాక కాలువలో ఓ మృతదేహం కొట్టుకువచ్చిందని ఇప్పుడు మరో మృతదేహం కొట్టుకురావడంతో గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారు. మృతుని ఒంటిపై ఎటువంటి దుస్తులు లేవని అన్నారు. రూరల్ ఎస్సై బి సురేంద్ర కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సచివాలయ ఉద్యోగుల్లో గందరగోళం

- బదిలీల్లో ఉద్యోగులతో కూటమి ప్రభుత్వం ఆటలు
- ఇదే అదనుగా తీసుకుంటున్న ఉన్నతాధికారులు
- కొన్ని శాఖల్లో లంచాలు సైతం డిమాండ్
- కలెక్టర్ చెప్పినా పట్టించుకోని వైనం



జిల్లా వ్యవసాయశాఖ అధికారి కార్యాలయం వద్ద అర్ధరాత్రి సచివాలయ ఉద్యోగుల ధర్నా (ఫైల్)

జిల్లా వ్యాప్తంగా సచివాలయాలు	517
క్రమబద్ధీకరణ పేరుతో రద్దు చేసినవి	187
సచివాలయ ఉద్యోగులు మొత్తం మంజూరు	5,591
ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న వారు	4,412
ఖాళీగా ఉన్న ఉద్యోగాలు	1,179

ఏలూరు (మెట్రో): ఉద్యోగాలు ఉంచుతారా... పీకేస్తారా... ఉంచితే ఏ శాఖ కేటాయిస్తారు.. ఏ పనులు చేయమంటారు.. ఇవీ సచివాలయ ఉద్యోగుల మదిలో మెదులుతున్న ప్రశ్నలు. ఈ ప్రశ్నలకు ఒక జవాబు మాత్రమే దొరికింది. కేవలం ఉద్యోగాన్ని మాత్రం ఉంచుతారు అనే సమాధానంతో సచివాలయ ఉద్యోగులు కాస్త ధైర్యంగా ఉన్నా మిగిలిన విషయాల్లో మాత్రం ప్రభుత్వం ఒక వైపు.. ఆయా శాఖల ఉన్నతాధికారులు మరో వైపు ఇబ్బందులకు గురి చేస్తుండడంతో అల్లాడుతున్నారు.

ప్రతి గ్రామంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు గత వైఎస్సార్ సీపీ సర్కారు గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. నిరుద్యోగులను సైతం ఆదుకునే విధంగా ఒక్కో సచివాలయంలో 10 నుంచి 15 మందికి శాఖల వారీగా ఉద్యోగాలను కల్పించింది. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే సచివాలయ ఉద్యోగులను తొలగించేందుకు అనేక కుట్రలు పన్నింది. అవి పనిచేయక ఉద్యోగులను తీవ్రంగా ఇబ్బందులకు గురి చేసేందుకు సిద్ధం అయ్యింది.

మొదటి అస్త్రంగా రేషనలైజేషన్ (క్రమబద్ధీకరణ)

ఉద్యోగులను ఇబ్బందులు పెట్టే కుట్రల్లో భాగంగా క్రమబద్ధీకరణ అనే విధానాన్ని తీసుకొచ్చింది. దీనిలో భాగంగా ఉద్యోగులను సచివాలయాల నుంచి తొలగించి ఆయా శాఖలకు సర్దుబాటు చేస్తున్నట్లు ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా 517 సచివాలయాలు ఉండగా వాటిలో 187 సచివాలయాలను కూటమి సర్కారు ఈ క్రమబద్ధీకరణ పేరుతో రద్దు చేసింది. జనాభాకు సరిపడా సచివాలయాలను ఏర్పాటు చేశామని ఈ రద్దుకు కారణంగా చెప్పుకొస్తుంది.

రెండో అస్త్రంగా వేరే శాఖలకు సర్దుబాటు

జిల్లా వ్యాప్తంగా తొలగించిన 187 సచివాలయాల్లో ఉద్యోగులను పూర్తిగా తీసేస్తే వ్యతిరేకత వస్తుందని భావించిన కూటమి సర్కారు ఆ ఉద్యోగులను శాఖలకు సర్దుబాటు చేసే ప్రక్రియ ప్రారంభించింది. ఉద్యోగులకు ఎస్, నో అనే ఆప్షన్లు చూపించి నో అని ఉన్న సచివాలయ సిబ్బందిని వారికి నచ్చిన శాఖకు బదిలీ చేసేందుకు చర్యలు తీసుకుంటుంది. అసలు తాము చదివిన చదువు ఏమిటి, తాము జాయిన్ అయిన ఉద్యోగం ఏమిటి, ఇప్పుడు ఏ ఉద్యోగం చేయాలో తెలీక సచివాలయ ఉద్యోగులు తీవ్ర ఆందోళనను ఎదుర్కొంటున్నారు.

శాఖల మధ్య సమన్వయ లోపం

ఇక ఉద్యోగులు తమ ఉద్యోగం కాపాడుకోవడం ఒక అదృష్టంగా భావిస్తున్న తరుణంలో ఉన్నతాధికారుల బంతాటతో ఎక్కడ తాము ఉద్యోగం చేయాలో అర్థం కాని పరిస్థితుల్లో ఉంటున్నారు. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన ఉద్యోగాల ఏర్పాటు, బదిలీ ఉంటుందని చెప్పడంతో ఏలూరు జిల్లా అధికారులు విడిపోయిన పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాలకు ఉద్యోగుల కేటాయింపులు చేస్తున్నారు. దీంతో అభ్యర్థులు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు.

ఉద్యోగుల బదిలీల్లో వసూళ్ల పర్వం

సచివాలయ ఉద్యోగుల బదిలీ అనేది ఉద్యోగికి తీవ్ర ఇబ్బందిగా మారితే అధికారులకు, ఆయా శాఖలో కీలక పాత్ర పోషించే ఉద్యోగులకు మాత్రం కాసుల మూటగా మారాయి. బదిలీల పేరుతో సచివాలయ ఉద్యోగులకు కావాల్సిన ప్రాంతం కేటాయించేందుకు రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకూ వసూళ్లు చేస్తున్నారు. ప్రాంతాలను బట్టి రేటు ఏర్పాటు చేసి ఆ సొమ్ములు ఇవ్వకుంటే దూరంగా నియమిస్తున్నారు.

పలుమార్లు కలెక్టర్ ఆగ్రహం

జిల్లాలో బదిలీల ప్రక్రియపై కలెక్టర్ వెట్రిసెల్వి ఉన్నతాధికారులను పిలిచి సమావేశాలు ఏర్పాటు చేసినా అధికారులు సమన్వయం చేసుకోకపోగా వారి ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. నిబంధనల ప్రకారం చేయాలని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసినా అధికారుల్లో మాత్రం మార్పు రాలేదు. ఇదేమిటని ప్రశ్నించిన సచివాలయ ఉద్యోగులకు దూరంగా బదిలీ అనే బహుమతిని ఇస్తున్నారు. ఇలా సచివాలయ ఉద్యోగులు తమ ఉద్యోగాన్ని కాపాడుకునే పనిలో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

తపాలా శాఖలో అడ్వాన్స్‌డ్ పోస్టల్ టెక్నాలజీ

భీమవరం: ప్రజలకు మరింత మెరుగైన, వేగవంతమైన సేవలను అందించడానికి భారత ప్రభుత్వ తపాలా శాఖ అడ్వాన్స్‌డ్ పోస్టల్ టెక్నాలజీ 2.0 ని ప్రారంభిస్తున్నట్లు భీమవరం డివిజన్ పోస్ట్ ఆఫీసెస్ సీనియర్ సూపరింటెండెంట్ కె.హరికృష్ణప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త టెక్నాలజీ ద్వారా ప్రజలు తమ ఇంటి వద్ద నుంచే రిజిస్టర్ లెటర్స్ లేదా స్పీడ్ పోస్టులను బుక్ చేసుకోవచ్చునని అలాగే ఎస్ఎంఎస్, ఈ మెయిల్ ద్వారా బుకింగ్, డెలివరీకు సంబంధించిన అప్‌డేట్స్‌ను ఎప్పటికప్పుడు పొందవచ్చునన్నారు. అడ్వాన్స్‌డ్ పోస్టల్ టెక్నాలజీ ద్వారా ఓటీపీ బేస్డ్ లేదా ఆధార్ బేస్డ్ డెలివరీను ప్రజలు ఎంచుకోవచ్చునని యూపీఐ ద్వారా నగదు లావాదేవీలు చేసుకునే సౌకర్యం ఉందని హరికృష్ణప్రసాద్ తెలిపారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

ముదినేపల్లి రూరల్: అదనపు కట్నం వేధింపులపై బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మండలంలోని అల్లూరు గ్రామానికి చెందిన అర్జా మున్నీకి బంటుమిల్లి మండలం పెదతుమ్మిడి గ్రామానికికి చెందిన దుర్గాప్రసాద్‌తో 2023లో వివాహమైంది. ఆ సమయంలో రూ.2 లక్షలు నగదు లాంచనాలు కింద ఇచ్చారు. అనంతరం దుర్గాప్రసాద్ వ్యసనాలకు బానిసై తరచూ డబ్బు తీసుకురమ్మని వేధించడంతోపాటు అత్త, కుటుంబ సభ్యులు సైతం అధిక కట్నం వేధిస్తున్నట్లు బాధితురాలు మున్ని ఫిర్యాదులో పేర్కొంది. ఈ నేపథ్యంలో భర్త, అత్త, మామతో పాటు బావ అల్లూరులోని తన పుట్టింటికి వచ్చి విడాకులు ఇవ్వమని కోరగా తిరస్కరించడంతో తనతో పాటు తన తల్లిదండ్రులను కొట్టి గాయపరిచినట్లు బాధితురాలు మున్ని పోలీసులకు ఫిర్యాదు చేసింది.

యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు



తడికలపూడిలోని సుబ్బులు కుంట చెరువులో మట్టి తవ్వకాలు



మాధవరంలోని కొత్త చెరువులోని మట్టిని లారీలో తరలిస్తున్న దృశ్యం

కామవరపుకోట: మండలంలో మట్టి దందా యథేచ్ఛగా సాగుతోంది. కూటమి ప్రభుత్వ నాయకుల అండదండలతో పగలు రాత్రి తేడా లేకుండా చెరువులోని మట్టిని కొల్లగొడుతూ కాసులు సొమ్ము చేసుకుంటున్నారు అక్రమార్కులు. అధికారుల నుంచి ఏ విధమైన అనుమతులు లేకుండా గత కొన్ని రోజులుగా తడికలపూడి గ్రామ శివారులోని సుబ్బులు కుంట చెరువులో జేసీబీలతో మట్టిని తవ్వి అక్రమంగా తరలిస్తున్నారు. ట్రాక్టర్లకు, జేసీబీలకు సైతం నెంబర్ ప్లేట్లు తీసేసి ఈ మట్టి దందా కొనసాగించడం గమనార్హం. ట్రాక్టర్ ట్రక్కు మట్టి రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు విక్రయించి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు ఈ వ్యవహారంపై నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఇరిగేషన్ అధికారులను వివరణ అడుగగా మట్టి తవ్వకాలకు అనుమతులు లేవని తెలిపారు. తహసీల్దార్‌కి ఈ విషయం తెలియజేయగా వారిపై చర్య తీసుకుంటామని తెలిపారు.

కొత్త చెరువులో మట్టి అక్రమ తవ్వకాలు

తాడేపల్లిగూడెం రూరల్: కూటమి నాయకులకు మట్టి బంగారమాయె' అన్నట్టుగా మారింది. ప్రధానంగా మండలంలోని మాధవరం గ్రామంలో రమారమీ 40 ఎకరాల విస్తీర్ణంలోని కొత్త చెరువులో యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. రెండు జేసీబీలను ఏర్పాటు చేసి లారీల్లో సరిహద్దు నియోజకవర్గమైన నిడదవోలు మండలంలోని ఇటుక బట్టీలకు తరలిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. నిత్యం పదుల సంఖ్యలోని వాహనాల్లో మట్టి తరలిపోతుంది. లారీ మట్టి రూ.2500 చొప్పున విక్రయిస్తున్నట్లు సమాచారం. దీంతో కూటమి నాయకులకు మూడు పువ్వులు ఆరుకాయలుగా వ్యాపారం సాగుతోంది. చెరువులో నీరు ఉన్నా రాజమార్గం ఏర్పాటు చేసుకుని మరీ లారీల్లో మట్టిని తరలించేయడం గమనార్హం. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు స్పందించకపోవడంపై వారికి తెలిసీ మిన్నకుంటున్నారా? లేదా ఆమ్యామ్యాల మత్తులో జోగుతున్నారా ? అనే దానిపై ప్రజలు చెవులు కొరుక్కుంటున్నారు. దీనిపై సంబంధిత శాఖ అధికారికి ఫోన్ చేయగా స్పందించలేదు.

రూ.22.43 లక్షల ఎరువుల అమ్మకాలు నిలుపుదల



తాడేపల్లిగూడెంలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్న ప్రత్యేక బృందం సభ్యులు

తాడేపల్లిగూడెం రూరల్: రాష్ట్ర విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, వ్యవసాయ శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందం బుధవారం తాడేపల్లిగూడెంలోని ఎరువులు, పురుగు మందుల గోదాములను తనిఖీ చేసింది. ఈ సందర్భంగా కోరమండల్ స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేశారు. అలాగే, ఎఫ్ఎంసీ గోదామును పరిశీలించి సూక్ష్మ పోషక ఎరువులు బయోస్టిమ్యులెంట్స్‌ను గుర్తించి, రూ.22,43,950 విలువైన ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశారు. కంపెనీ స్టాక్ పాయింట్‌లను పరిశీలించి నిల్వలను తనిఖీ చేశారు. ఈ బృందంలో జిల్లా వనరుల కేంద్రం (పెద్దాపురం) సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.బుల్లిబాబు, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ గోపాలకృష్ణ, తాడేపల్లిగూడెం ఏడీఏ గంగాధరరావు, ఏవో నారాయణరావు, వ్యవసాయాధికారి (టెక్నికల్) కృష్ణకాంత్ ఉన్నారు.

పెంటపాడులో...

పెంటపాడు: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి చీర్ల రవికుమార్ ఆధ్వర్యంలో ఐటీపీ గోపాలకృష్ణ, ఏడీఏ బుల్లిబాబు, గూడెం ఏడీఏ గంగాధర్‌ల ఆధ్వర్యంలో పలు కంపెనీలకు చెందిన అక్రమంగా నిల్వ ఉన్న ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ తనిఖీల్లో రికార్డులు సరిగా లేని రూ.1,07,000 విలువైన ఎరువులను గుర్తించి వాటి విక్రయాలను నిలుపుదల చేసినట్లు చెప్పారు.

శ్రీవారి దేవస్థానంలో తనిఖీలు



అంబరుఖానాలో లడ్డూ ప్రసాదాల తయారీని పరిశీలిస్తున్న భ్రమరాంబ

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయంలో భక్తులకు అందుతున్న వసతులు, సౌకర్యాలు, పారిశుద్ధ్య నిర్వహణ, ప్రసాదాల నాణ్యతలను రాష్ట్ర దేవాదాయ శాఖ జాయింట్ కమిషనర్, ఎస్‌ఓపీ నోడల్ అధికారిణి భ్రమరాంబ బుధవారం తనిఖీ చేశారు. ముందుగా ఆమె స్వామి, అమ్మవార్లను దర్శించి, ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితుల నుంచి వేద ఆశీర్వచనాన్ని పొందారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆమెకు శ్రీవారి జ్ఞాపికను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం భ్రమరాంబ ఆలయ ఈఓ ఎన్వీ సత్యనారాయణ మూర్తి, ఇతర అధికారులతో కలిసి పారిశుధ్యం, క్యూ లైన్ల నిర్వహణ, దర్శనం ఏర్పాట్లు, డార్మేటరీలో వసతులు, భక్తులు సంచరించే ప్రదేశాల్లో ఉన్న సౌకర్యాలు తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల శుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆ తర్వాత ప్రసాదాల తయారీ విభాగం, అన్న ప్రసాద భవనం, ఉచిత అన్న ప్రసాద వితరణను పరి శీలించారు. భక్తులకు అందిస్తున్న అన్నప్రసాదం, లడ్డూ, పులిహోర, శర్కర పొంగలి, ఉచిత ప్రసాదాల రుచి, నాణ్యతను పరిశీలించి భక్తుల అభిప్రాయాలను సేకరించి సంతృప్తి వ్యక్తం చేశారు.

గురుకుల విద్యార్థులకు ర్యాంకులు



ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాజారావు

తాడేపల్లిగూడెం రూరల్: సైన్స్, ఒలంపియాడ్ ఫౌండేషన్ పరీక్షలో పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సాంఘీక, సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించారని ప్రిన్సిపాల్ బి.రాజారావు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం గురుకుల పాఠశాల ఆవరణలో అభినందన సభ నిర్వహించారు. ప్రిన్సిపాల్ రాజారావు మాట్లాడుతూ సైన్స్, ఒలంపియాడ్‌లో ప్రపంచ వ్యాప్తంగా 72 దేశాలకు చెందిన 92,499 విద్యార్థులు పాల్గొన్నారని, వీరిలో 158 మంది గురుకుల విద్యార్థులు ఉన్నారన్నారు. అంతర్జాతీయ స్థాయిలో గురుకులంనకు చెందిన సీహెచ్.సాహస్ హిందీలో 131వ ర్యాంకు, డి.హర్షవర్దన్ హిందీలో 150వ ర్యాంకు, ఎ.పాల్సన్ హిందీలో 149వ ర్యాంకు, జి.హర్షవర్దన్ హిందీలో 176వ ర్యాంకు, టి.మురళీ గణితంలో 1210వ ర్యాంకులు సాధించారన్నారు. అనంతరం విద్యార్థులను అభినందిస్తూ సర్టిఫికెట్లు అందజేశారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్ యాజమాన్యాన్ని బెదిరించిన 8 మందిపై కేసు

చింతలపూడి: పట్టణంలోని ఒక ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాన్ని బెదిరించి డబ్బులు గుంజాలని చూసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె సతీష్ కుమార్ బుధవారం తెలిపారు. పట్టణంలోని హైగ్రీవా ఎలైట్ స్కూల్ యాజమాన్యాన్ని మంగళవారం స్టూడెంట్స్ యూనియన్ సభ్యులమని చెప్పి కొందరు సొమ్ముల కోసం డిమాండ్ చేశారు. దీనిపై స్కూల్ హెడ్‌మాస్టర్ షేక్ ఫకీర్ సాహెబ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నూజివీడు, ముసునూరు మండలాలకు చెందిన ఎనిమిది మందిపై కేసు నమోదు చేసి తహసీల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు చెప్పారు. గతంలో లింగపాలెం, టీ. నర్సాపురం, కామవరపుకోట మండలాల్లో కూడా నిందితులపై ఆరోపణలు ఉన్నట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

వచ్చేనెల 14 నుంచి పిఠాపురంలో బాస్కెట్‌బాల్ పోటీలు

ఏలూరు రూరల్: ఆగస్టు 14వ తేదీ నుంచి 17 వరకూ కాకినాడ జిల్లా పిఠాపురం ఓటీఎస్ హైస్కూల్ ఆవరణలో ఏపీ 10వ ఇంటర్ డిస్ట్రిక్ జూనియర్ బాలబాలికల బాస్కెట్‌బాల్ పోటీలు జరగనున్నాయని ఆంధ్రప్రదేశ్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ జి చక్రవర్తి ఓ ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జనవరి 01, 2007 తర్వాత పుట్టిన వారై ఉండాలన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ, నైపుణ్యం ప్రదర్శించిన క్రీడాకారులను రాష్ట్ర జట్లుకు ఎంపిక చేస్తామని వెల్లడించారు. అనంతరం బాలబాలికల జట్లుకు ఆగస్టు 19 నుంచి 29 వరకూ పిఠాపురంలోనే కోచింగ్ క్యాంప్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. క్యాంప్ ముగిసిన తర్వాత రాష్ట్ర జట్లు సెప్టెంబర్ 2 నుంచి 9వ తేదీ వరకూ పంజాబ్ రాష్ట్రం లుధియానాలోని నానక్ ఇండోర్ స్టేడియంలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటుందని వివరించారు. ఆసక్తి గల పోటీదారులు 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో పాటు ఒరిజినల్ డేటా ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, ఆధార్‌తో ఆగస్టు 14వ తేదీ ఉదయం 9 గంటలకు పిఠాపురం పోటీల ప్రాంతానికి ఆయా జట్ల తరుపున హాజరుకావాలని సూచించారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న వ్యాన్.. ఒకరు మృతి

మరొకరికి గాయాలు



దిర్శిపాము శ్రీను (ఫైల్)



ఘటనా స్థలంలో ట్రాక్టర్‌ను ఢీకొన్న వ్యాన్

తాడేపల్లిగూడెం రూరల్ : ట్రాక్టర్‌ను వ్యాన్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన పెదతాడేపల్లి జాతీయ రహదారి నెం.16పై బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ద్వారకాతిరుమల మండలం కోడిగూడెం గ్రామానికి చెందిన దిర్శిపాము శ్రీను (40) కోడిపెంట కోసం ట్రాక్టర్‌పై తణుకు వెళ్తుండగా, చిత్తూరు జిల్లా బంగారుపాలెం నుంచి మామిడికాయ లోడుతో వస్తున్న వ్యాన్ ఢీకొంది. శ్రీను తన ట్రాక్టర్‌ను ఒక్కసారిగా ఎడమ వైపు నుంచి కుడివైపునకు తిప్పడంతో ఈ ప్రమాదం జరిగినట్లు వ్యాన్ డ్రైవర్ హరీష్ తెలిపారు. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ శ్రీను ఇంజన్ చక్రం కింద పడి మృతి చెందగా, వ్యాన్ డ్రైవర్ పనిగంటి హరీష్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసులో ఇద్దరికి ఆరేళ్ల జైలు

నరసాపురం: పోక్సో కేసులో ఇద్దరు యువకులకు ఆరేళ్ల జైలు, ఒక్కొక్కరికి రూ.25 వేలు జరిమానా విధిస్తూ భీమవరం పోక్సో కోర్టు తీర్పు చెప్పినట్లు నరసాపురం డీఎస్పీ జి.శ్రీవేద తెలిపారు. మొగల్తూరు మండలం కేపీపాలెంకు చెందిన బాలికపై అదే గ్రామానికి చెందిన మైలాబత్తుల దిలీప్‌కుమార్, మైలాబత్తుల కమల్‌కుమార్, బాలం శివ 2016 మే 5న గ్రామంలో ఓ మేకల షెడ్డు వద్ద లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. బాలిక మూడు రోజుల తర్వాత మొగల్తూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ముగ్గురిపై అప్పటి ఎస్సై డీజే రత్నం పోక్సో కేసు నమోదు చేశారు. కేసులో దోషులుగా తేల్చిన మైలాబత్తుల దిలీప్‌కుమార్, బాలం శివలకు శిక్ష విధిస్తూ పోక్సో కోర్టు జడ్జి బీ.లక్ష్మీనారాయణ తీర్పు చెప్పినట్లు డీఎస్పీ వివరించారు. మరో నిందితుడు మైలాబత్తుల కమల్‌కుమార్‌ను నిర్దోషిగా విడుదల చేశారు. బాలికకు రూ.40 వేలు నష్టపరిహారం అందించాలని కోర్టు లీగల్ కౌన్సిల్‌కు సిఫార్సు చేసింది.

అదృశ్యమైన తల్లీకుమారుల ఆచూకీ లభ్యం

ఆకివీడు: అదృశ్యమైన తల్లీకుమారుల ఆచూకీని పోలీసులు కనుగొని వారిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కై కలూరు మండలం భుజబలపట్నంకు చెందిన మేకా వెంకటలక్ష్మి కుమార్తె, మనువడు మే 21వ తేదీన ఆకివీడు మండలం చెరుకుమిల్లి గ్రామం వచ్చి ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయారు. దీనిపై కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా సెల్‌నెంబర్ ఆధారంగా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వారి ఆచూకీ కనిపెట్టినట్లు ఎస్సై హనుమంతు నాగరాజు బుధవారం చెప్పారు. ఆ తల్లీకుమారులను కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై చెప్పారు.

పీఎం సూర్యఘర్‌పై విస్తృత ప్రచారం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పీఎం సూర్యఘర్ పథకంపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కలిగించేందుకు విస్తృత ప్రచారం అవసరమని ఈపీడీసీఎల్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ టి.వనజ అన్నారు. బుధవారం స్థానిక విద్యుత్ భవన్‌లో పీఎం సూర్యఘర్ పథకంపై నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. సోలార్ విద్యుత్ ప్యానల్స్ ఏర్పాటుకు ప్రజలను ప్రోత్సాహించాలని సూచించారు. పీఎం సూర్యఘర్ పథకం అమలులో జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవడాన్ని ఆమె ప్రశంసించారు. లబ్ధిదారులకు ఆలస్యం లేకుండా రుణాలు మంజూరు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ పి.సాల్మన్ రాజు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టెక్నికల్ పి.రాధాకృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆపరేషన్స్ కేఎం అంబేద్కర్, పలువురు ఈఈలు, ఏఈఈలు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, సోలార్ వెండర్లు పాల్గొన్నారు.

మోటార్‌సైకిళ్ల చోరీపై కేసు నమోదు

మండవల్లి: రెండు మోటార్‌సైకిళ్ల చోరీపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. గుడ్లవల్లేరు మండలం కూరాడ గ్రామానికి చెందిన దివి కార్తీక్ జూన్ 23న మండవల్లి ఇండియన్ బ్యాంక్ ఏటీఎం వద్ద డబ్బులు డ్రా చేసుకుని తిరిగి వచ్చేటప్పటికి అతని బైక్ కన్పించలేదు. దీంతో మండవల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పెదపారుపూడి గ్రామానికి చెందిన కొప్పురావూరి శాంతికుమార్ జూన్ 26న సాయంత్రం లోకుమూడి సెంటర్‌లో మోటార్ సైకిల్ పార్కు చేసి జ్యూస్ పాయింట్‌కి వెళ్లి తిరిగి వచ్చి చూడగా అతని బైక్ కన్పించలేదు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

మృతుల కుటుంబాలకు మాజీ మంత్రి కొట్టు పరామర్శ



యలమాటి కృష్ణారావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నీలాద్రిపురం గ్రామానికి చెందిన యలమాటి కృష్ణారావు ఇటీవల మృతి చెందారు. అలాగే, పుల్లాయగూడెం గ్రామానికి చెందిన అయినాల వెంకట నర్సమ్మ ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాలను బుధవారం మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట సొసైటీ మాజీ అధ్యక్షుడు వెలిశెట్టి నరేంద్రకుమార్, వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ కనుపూరి ఉదయ్‌భాస్కర్, నాయకులు కొట్టు నాగేంద్ర, చీకట్ల మల్లేశ్వరరావు, సిర్రాపు శాంతకుమార్ తదితరులు ఉన్నారు.

ఉచిత హోమియో వైద్య శిబిరం



రోగులకు ఉచితంగా మందులు అందజేస్తున్న దృశ్యం

పెంటపాడు: మండలంలోని ప్రత్తిపాడు పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం ఉచిత హోమియో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు ఏఎస్ఆర్ హోమియోపతి వైద్యకళాశాల, ఉమర్‌ఆలీషా ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 300 మంది రోగులకు డాక్టర్లు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చెరుకూరి జగత్‌సోమశేఖర్, మట్టా రాంబాబు, ఓపీడీ ఇన్‌చార్జి ధనాల సాయిరాం, అడబాల రత్నం, తోట శంకర్, చదలవాడ శ్రీకాంత్, మజ్జి అప్పారావు, గ్రామ కార్యదర్శి పసుపులేటి నాగేశ్వరరావు, ఏఎస్ఆర్ వైద్యకళాశాల సిబ్బంది, ఉమర్‌ఆలీషా రూరల్‌డవలప్‌మెంట్ సభ్యులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లు కాలిపోతుందా.. అయ్యో ఫైర్ ఇంజన్ లేదండి

- ఇదీ తణుకు అగ్నిమాపక కేంద్ర దుస్థితి
- మరమ్మతులకు గురైన అగ్నిమాపక కేంద్ర వాహనం
- వారం రోజులుగా అందుబాటులో లేని వైనం
- ప్రమాదం సంభవిస్తే గెస్టు వాహనాలే దిక్కు
- భయాందోళనలో తణుకువాసులు



తణుకు అగ్నిమాపక కేంద్రంలో వాహనం లేకపోవడంతో ఖాళీగా ఉన్న భవనం

తణుకు అర్బన్: అగ్నిప్రమాదం సంభవించిందా.. మీ ఆస్తులు అగ్నికి ఆహుతి కావాల్సిందే అన్నట్లుగా ఉంది తణుకు అగ్నిమాపక కేంద్ర దుస్థితి. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు కీలకంగా వ్యవహరించి ప్రాణ నష్టం లేకుండా చూస్తూనే ఆస్థి నష్టాన్ని కూడా నిలువరించే కీలకమైన విభాగమైన అగ్నిమాపక కేంద్ర సేవలు తణుకులో మూలనపడ్డాయి. గత వారం రోజులుగా తణుకు అగ్నిమాపక కేంద్రంలో ఉన్న అగ్ని ప్రమాద వాహనం మరమ్మతులకు గురవ్వడంతో వాహన సేవలు అందుబాటులో లేకుండాపోయాయి. వాహనానికి సంబంధించిన పనిముట్లు దొరకకపోవడంతో వాహనం మూలకు చేరింది. ఈనెల 12వ తేదీన ఉదయం స్థానిక అంజనా టవర్స్‌లోని వస్త్ర, ఫ్యాన్సీ దుకాణాల్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించి సుమారుగా రూ. 10 లక్షలు వరకు ఆస్థి నష్టం ఏర్పడింది. అయితే తణుకు అగ్నిమాపక కేంద్రానికి కూతవేటు దూరంలో జరిగిన ఈ అగ్నిప్రమాద సమయంలో తణుకు కేంద్ర వాహనం అందుబాటులో లేకపోవడంతో ప్రమాద తీవ్రత భారీగా పెరిగింది. అత్తిలి అగ్నిమాపక కేంద్రం నుంచి వాహనం వచ్చేలోపల జరగాల్సిన నష్టం జరిగిపోయింది. అదే వాహనం అందుబాటులో ఉండి ఉంటే అంతమేర నష్టం జరగకుండా ఉండేదని బాధితులు, స్థానిక ప్రజానీకం అంటున్నారు. ఈ ఘటన చోటుచేసుకుని ఇప్పటికే 5 రోజులు గడిచినా వాహనాన్ని ఇంతవరకు సిద్ధం చేయలేకపోవడంతో తణుకు పరిసర ప్రాంతంలో ఏదైనా పెను ప్రమాదం జరిగితే పరిస్థితి ఏంటనే భయాందోళన తణుకు ప్రజల్లో నెలకొంది.

తణుకులో అగ్నిప్రమాదాలు

సంవత్సరం.	ప్రమాదాల సంఖ్య	ఆస్థి నష్టం	రక్షించింది
2022-23	69	రూ. 1,76,45,000	రూ. 3,42,53,000
2023-24	80	రూ. 54,06,000	రూ. 1,12,44,000
2024-25	77	రూ. 44,05,000	రూ. 1,14,55,000

కర్మాగారాలు ఎక్కువ

వ్యాపార, వాణిజ్యపరంగా అభివృద్ధి చెందిన తణుకు ప్రాంతంలో వివిధ కర్మాగారాలతోపాటు బహుళ అంతస్థుల భవనాలు కూడా అధికంగానే ఉన్నాయి. అంతేకాకుండా జిల్లాలోనే వేసవి కాలంలో అత్యధిక అగ్నిప్రమాద ఘటనలు చోటుచేసుకునే ప్రాంతాల్లో తణుకు ముందువరసలో ఉంటుంది. అంతటి ప్రాధాన్యత కలిగిన తణుకులో వారం రోజులుగా వాహనం అందుబాటులో లేకపోయినా ఉన్నతాధికారులు సైతం ఎటువంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా భగవంతుడిదే భారం అన్నట్లుగా వ్యవహరించడం శోచనీయం.

అసలే మండుతున్న ఎండలు

గత వారం రోజులుగా వాతావరణ పరిస్థితుల్లో పెనుమార్పులు ఏర్పడి వర్షాలు పోయి వేసవిని మించిన ఎండలు, వేడిగాల్పులు చోటుచేసుకుంటున్నాయి. దీంతో ప్రజానీకం బెంబేలెత్తిపోతున్నారు. ఇళ్ల పైభాగాల్లో నీటితో తడుపుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. దీంతో ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్న రోజుల్లో వాహనం అందుబాటులో లేదని తెలుసుకున్న ప్రజలు భయపడుతున్నారు. ఇటీవల తణుకు తంగిరాల వారి వీధిలోని రామకృష్ణ టవర్స్‌లో ఒక ఫ్లాట్‌లో చోటుచేసుకున్న అగ్ని ప్రమాద ఘటనలో కేంద్ర సిబ్బంది సకాలంలో వెళ్లి మంటలను అదుపులోకి తీసుకురావడంతో మిగిలిన 9 ఫ్లాట్‌లలో నివాసితులు ఎటువంటి ఇబ్బంది లేకుండా బయటపడ్డారు. అదే వాహనం అందుబాటులోలేని సమయంలో ప్రమాదం చోటుచేసుకుంటే జరిగే నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇంకా వాహనం అందుబాటులోకి వచ్చేందుకు సమయం పడుతుందని తెలుస్తోంది. ఈ సమస్యపై జిల్లా అగ్నిమాపక అధికారి బి.శ్రీనివాస్‌ను 'సాక్షి' వివరణ కోరగా వాహనానికి మరమ్మతులు పూర్తయ్యాయని అందుబాటులో వచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు.

పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్‌కు స్థలం కేటాయింపుపై హర్షం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్యవైశ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్‌కు స్థలం కేటాయింపుపై ఆర్యవైశ్యులు హర్షం ప్రకటించారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బుధవారం సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో తొలుత అమరజీవి పొట్టి శ్రీరాములకు, మహాత్మా గాంధీ చిత్రపటాలకు నివాళులర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం అమరజీవి పొట్టి శ్రీరాముల స్మృతివనంనకు 6 ఎకరాలు 80 సెంట్లు స్థలం కేటాయింపుపై హర్షం వ్యక్తం చేశారు. పద్మనాభుని మురళీమోహన్, కొర్లపర రాము, పులవర్తి రాంపండు, పసుమర్తి అనిల్, వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

17నుంచి ప్రత్యేక శిబిరాలు

అత్తిలి: మండలంలో ఆరు సంవత్సరాల లోపు పిల్లలకు ఆధార్ నమోదు కోసం ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జ్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం. శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఈ కేంద్రాలు ఈనెల 17, 18 తేదీల్లో ఉనికిలి, కంచుమర్రు, అత్తిలి, మంచిలి గ్రామాల్లోను, 17న పాలూరు, 18న కేఎస్ గట్టు గ్రామాల్లో నిర్వహిస్తారని తెలిపారు, 22, 23 తేదీల్లో అత్తిలి 1, తిరుపతిపురం, గుమ్మంపాడు, వరిగేడు గ్రామాల్లో ఈ శిబిరాలు నిర్వహిస్తారని తెలిపారు.

మధ్యవర్తిత్వంతో ఆమోదయోగ్య రాజీ



ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మధ్యవర్తిత్వంతో ఆమోదయోగ్యమైన రాజీ చేయవచ్చని 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా అన్నారు. బుధవారం మధ్యవర్తిత్వంపై ప్రత్యేక అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సికిందర్ భాషా మాట్లాడుతూ మధ్యవర్తిత్వంపై కేసును రాజీ చేసుకున్నట్లుతే డబ్బు, సమయం ఆదా అవుతుందన్నారు. ఈ అవకాశాన్ని తప్పక సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి, జూనియర్ సివిల్ జడ్జి ఎస్.సూర్యకిరణ్ శ్రీ, ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కె.లలితాదేవి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శిరిగినీడి విజయకృష్ణ, న్యాయవాదులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మోతాదుకు మించి ఎరువుల వాడకం వద్దు



మండపాకలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏవో రాజేంద్రప్రసాద్



బల్లిపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఓ రాజేష్

తణుకు అర్బన్: మండలంలోని ముద్దాపురం, మండపాక గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రైతులు మోతాదుకు మించి ఎరువులు ఉపయోగించవద్దని దీనివలన భూమి యొక్క సారము దెబ్బతినడమే కాకుండా పైరు పైన వచ్చే పురుగులు, తెగుళ్ల అధికమవుతాయని సూచించారు. ప్రతి రైతు జీవన ఎరువులు (అజొస్పోరల్లం, పాస్ఫోబాక్టర్, వీఏఎం ఫంగి, పొటాషియం మొబలైజింగ్ బ్యాక్టీరియా) వంటి వాటిని ఉపయోగించినట్లయితే ఎకరానికి రైతు పెట్టే ఖర్చులో 20 శాతం తగ్గించుకోవచ్చని, చీడపీడలు కూడా అదుపులో ఉంటాయని స్పష్టం చేశారు. ఈ జీవన ఎరువులు వాడకం వలన భూమిలో మొక్కకు అందుబాటులో లేని పోషకాలను అందుబాటులోనికి తెస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నారు సుతలు తెంచి నాట్లు వేసుకోవాలి

అత్తిలి: మండలంలో కొమ్మర, బల్లిపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి టి.కే. రాజేష్ తెలిపారు. రైతులు వరినాట్లు వేసే పనులలో నిమగ్నమయ్యారని, నారు సుతలు తెంచి నాట్లు వేసుకోవాలని కోరారు. రైతులందరూ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బాబు మోసాలను ప్రజలకు వివరిద్దాం



లక్ష్మీనారాయణపురం గ్రామంలో బాబూ ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

అత్తిలి: ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు ఇచ్చిన హామీలను విస్మరించడంతో ప్రజల్లో నిరసన వ్యక్తమవుతోందని ఎంపీటీసీ సభ్యుడు ఆడారి శ్రీనివాసరావు అన్నారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా బుధవారం అత్తిలి మండలం లక్ష్మీనారాయణపురం గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ప్రజలు ఎంత మోసానికి గురయ్యారో వివరిస్తూ ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. యువత, నిరుద్యోగులు, మహిళలు, రైతులు, బీసీలు ఇలా అన్నివర్గాలను కూటమి ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలు పక్షాన పోరాడుతుండడంతో కూటమి గుండెల్లో గుబులు మొదలైందని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బొడ్డేటి శ్రీనివాసరావు, పార్టీనాయకులు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా మహాసభలు విజయవంతం చేయండి



తణుకులో మహాసభల కరపత్రాలను ఆవిష్కరించిన సీపీఐ నాయకులు

తణుకు అర్బన్: వచ్చేనెల 19, 20 తేదీల్లో తణుకులో నిర్వహించనున్న సీపీఐ జిల్లా సమితి 27వ జిల్లా మహాసభలు విజయవంతానికి అందరూ సహకరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కోరారు. బుధవారం తణుకు వంక సత్యనారాయణ సురాజ్య భవన్ నందు పార్టీ జిల్లా మహాసభల కరపత్రాన్ని పార్టీ నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ జిల్లా మహాసభల్లో భాగంగా ఆగస్టు 19న తణుకులో భారీ ప్రజా ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్న సీపీఐ జిల్లా మహాసభలు విజయవంతానికి అందరూ విరాళాలు అందజేసి సహకరించాలన్నారు. మహాసభలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరవుతారని, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు పాల్గొంటారని వివరించారు. సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, తణుకు ఏరియా కార్యదర్శి సికిలే పుష్పకుమారి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాంప్రసాద్, పట్టణ సమితి సభ్యులు గార ప్రసాద్, గుబ్బల వెంకటేశ్వరరావు, బొద్దాని మురళీ, నూనె రాధాకృష్ణ పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): భవన నిర్మాణ కార్మిక సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేయాలని ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) రాష్ట్ర నాయకత్వం డిమాండ్ చేసింది. తాడేపల్లిగూడెం పట్టణంలో బుధవారం ఏఐటీయూసీ రాష్ట్ర నాయకత్వం బోర్డు చైర్మన్ వలవల బాబ్జీతో భేటి అయ్యారు. రాష్ట్ర నాయకులు, కార్మికులు ఆధ్వర్యంలో చైర్మన్‌తో భవన నిర్మాణ కార్మికుల సమస్యలు, వెల్ఫేర్ బోర్డు సమస్యలను చర్చించారు. ఆయా సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పడాల శ్రీనివాస్, యూనియన్ జిల్లా అధ్యక్షుడు బొల్లాడ నాగరాజు, కార్యదర్శి పోలిరాతి ఆదినారయణ, జిల్లా నాయకులు మెండెం జేమ్స్, కోడే సాయి బాలాజీ, ఏరియా కమిటీ గౌరవాధ్యక్షులు బోడపాటి నాగేశ్వరరావు, ఏరియా కమటీ కార్యదర్శి అత్తిలి బాబి, చల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం స్పిరిట్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక డీఆర్ గోయింకా జూనియర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మెడికల్ ఎమర్జెన్సీ, బేసిక్ లైఫ్ సపోర్ట్ ప్రోగ్రామ్, సీపీఆర్‌పై డెమో కార్యక్రమం జరిగింది. స్పిరిట్ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ చిట్యాల సురేంద్ర కుమార్ మాట్లాడుతూ గుండె పనిచేయకుండా పోయినప్పుడు రక్త ప్రసరణ కొనసాగించాలి, శ్వాస సంబంధిత సమస్య ఊపిరి ఆగినప్పుడు ఆక్సిజన్‌ను శరీరానికి అందించాలని, తదితర విషయాలపై అవగాహన చేశారు. సమస్యలు వచ్చినప్పుడు రోగి ఉన్న ప్రదేశం సురక్షితంగా ఉండేలా చూసుకోవాలన్నారు. లయన్స్‌క్లబ్ స్పిరిట్ అధ్యక్షుడు పెదప్రోలు భాస్కర్, కార్యదర్శి అడ్డు రంజిత్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగ్గన్నపేట విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో గురువారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు డీఈఈ కే.నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలన్నారు.

19న సామాజిక తనిఖీ ప్రజా వేదిక

ఉండి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 19న ఉదయం 10 గంటలకు 18వ విడత సామాజిక తనిఖీల్లో భాగంగా నిర్వహించే మండల ప్రజావేదిక సభ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎంవీఎస్ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశంలో 2024-25 ఏడాదికి గానూ ఆయా గ్రామాల్లో చేపట్టిన ఎన్ఆర్ఈజీఎస్ పనులు, సామాజిక భద్రతా పింఛన్‌లపై ఏపీఎస్ఎస్ఏఏటీ ఆధ్వర్యంలో గ్రామాల్లో నిర్వహించిన సామాజిక తనిఖీ, ఆయా గ్రామ సభల్లోని నివేదికలను ప్రిసైడింగ్ అధికారి సమక్షంలో వాటిపై చర్చిస్తారని తెలిపారు.

విద్యుత్ సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

సాక్షి ఎఫెక్ట్

తణుకు అర్బన్: 'పైడిపర్రుకు కరెంటు కోత' శీర్షికన సాక్షి దినపత్రికలో బుధవారం ప్రచురితమైన కథనానికి తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ స్పందించారు. తణుకు సబ్ డివిజన్ పరిధిలోని అధికారులకు సమావేశం నిర్వహించి తణుకు నియోజకవర్గ పరిధిలోని తణుకు పట్టణం, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల్లోని వివిధ గ్రామాల్లో విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. విద్యుత్ కోతలు నివారించడంతోపాటు అనివార్య పరిస్థితుల్లో విధించే కోతల సమయాలను ప్రజలకు ముందుగానే తెలియచేయాలని ఆదేశించారు. లోఓల్టేజి సమస్యను పరిష్కరించడానికి ట్రాన్స్‌ఫార్మర్స్ అప్‌గ్రేడ్ చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు.

ఎండ ప్రచండం

- రోజురోజుకీ తీవ్రమవుతున్న ఎండలు
- ఉదయం నుంచే భానుడి ప్రతాపం మరూ



టూ టౌన్‌లో జువ్వలపాలెంలో ఖాళీగా ఉన్న రోడ్డు



జ్యూస్ షాపుల వద్ద ప్రజలు



ఎన్‌టీఆర్ బొమ్మ సెంటర్ వద్ద ఖాళీగా ఉన్న రోడ్డు

తాడేపల్లిగూడెం (టీఓసీ): జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. మూడు రోజుల నుంచి ఉదయం నుంచే ఎండ ప్రభావం చూపిస్తోంది. నడినెత్తిన సూర్యుడు భగభగ మండటుండడంతో ప్రజలు ఇంటి నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. రోహిణికార్తెలో రోళ్ల పగులుతాయని పెద్ద చెప్పిన మాట వాస్తవమన్నట్లుగా నిప్పుల కుంపటిలా ఎండ వేడి వేధిస్తోంది. మారిన వాతావరణంతో ఉష్ణోగ్రతలు పెరిగిపోయాయి. దానికి తోడు గాలి స్తంభించడంతో ఉక్కపోత అల్లాడిస్తోంది. కొద్దిసేపు ఫ్యాను తిరగకపోతే చెమటలతో దేహమంతా తడిసిపోతుంది. ఉదయం 6గంటల నుంచే ఎండ వేడి మొదలవుతోంది. సాయంత్రం 7గంటల వరకు ఉక్కపోతతో వేడి గాలులు వీస్తున్నాయి. ఇదే పరిస్థితి మరికొద్ది రోజులు కొనసాగే అవకాశం ఉందంటున్నారు వాతావరణ నిపుణులు.

జూలై నుంచి మండుతున్న ఎండలు:

రోహిణీ కార్తెను తలపించే విధంగా ఎండలు మండటంతో ఉక్కపోతతో ప్రజలు విలవిలాడుతున్నారు. మొన్నటి వరకు ఎండ ఎప్పుడు కాస్తుందా అని చూసిన ప్రజలు ప్రస్తుతం వరుణదేవుడు అనుగ్రహం కోసం ఎదురు చూసే పరిస్థితి నెలకొంది. మధ్యాహ్నం 12 అయితే చాలా కర్ఫ్యూ తలపించే విధంగా రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉక్కపోత విపరీతంగా ఉండటంతో దేహాన్ని చల్లబర్చుకునేందుకు శీతల పానీయాలు, పండ్లు రసాలు, కొబ్బరి బొండాలు కోసం ప్రజలు ఎగబడుతున్న దృశ్యాలు కన్పిస్తున్నాయి. వాన చుక్క కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఉద్యోగులు, సిబ్బంది కార్యాలయాలకు పరిమితం అవుతున్నారు. ఇంట్లో ఉండే వారు ఫ్యాన్ ఆగితే ఉండలేని స్థితి నెలకొని ఉంది. ఏసీలు ఉన్నవారు అవి లేకపోతే ఆపసోపాలు పడుతున్నారు. బయటకు తిరిగే కొద్ది మంది ఎండలు కారణంగా నోరు తరుచుగా ఎండిపోవడంతో వారు తాగు నీటి కోసం వేతుకులాడుతున్నారు. నీరు తాగిన తరువాత ఉక్కపోత కారణంగా చెమటలు స్వేధ గ్రంధులు నుంచి కారిపోవడంతో తిరిగి శరీరంలో నీరు లేకపోవడంతో డీహైడ్రేషన్‌కు గురి అవుతున్నారు. 5 గంటల దాటిన తరువాత ఉష్ణోగ్రతలు కొద్దిగా తగ్గుముఖం పట్టిన ఉక్కపోత రోజుంతా వెంటాడుతుంది. ఇరవై నాలుగు గంటలు ఫ్యాన్ లేకపోతే ఉండలేని పరిస్థితి నెలకుంది.

కైండ్‌నెస్ లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): కైండ్‌నెస్ లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. నియోజకవర్గంలోని పడమర విప్పరులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి ఆరు సీలింగ్ ఫ్యాన్లు అందజేశారు. ప్రభుత్వ సంస్థలకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు, పాఠశాలల విద్యార్థులకు చెప్పులు పంపిణీ, రూ 6 వేలు విలువైన ప్రతిభా స్కాలర్‌షిప్‌లు, ఇస్కాన్ ఆహార సేవకు రూ 3, 500 విరాళం, పోస్టల్ సిబ్బందికి సత్కారాలు జరిగాయి. కైండ్‌నెస్ లయన్స్ క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ గట్టిం ప్రవీణ్ కృష్ణ, గట్టిం మాణిక్యాలరావు, మునిసిపల్ కమీషనర్ యేసుబాబు, పిళ్ల వెంకన్నబాబు, కరిబండి రామకృష్ణ ఉన్నారు.